




# రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం...

## యాదగిరిపెల్లి రోడ్డులో తరచూ ప్రమాదాలు


యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరి పెల్లి వరకు నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్, అధికారులు సరి అయిన జాగ్రతలు తీసుకోకపోవడమ్, ట్రాఫిక్ ఎటు వైపు వెళ్లలో సరి అయిన నిర్దేశం లేకపోవడం తో స్థానికులు, మరియు గుట్ట కు వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ప్రమాదలతో ఇబ్బందులు పడుతున్నారు.. భక్తుల వాహనాలు ముందు దాకా వెళ్ళి దారి లేకపోవడం తో మళ్ళీ వెనక్కి వచ్చి ఎటుపోవాలో తెలియక తికమక పడుతున్నారు. సరి అయిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు నిర్మాణం జరుగుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఈ అయోమయం కలుగుతుందని యాదగిరి పల్లి గ్రామ-స్తులు చెబుతున్నారు. వాహనాలు ఎటువైపు వెళ్ళాలో మార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసినట్లయితే బాగుండేదని వారు అంటున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ సరైన చర్యలు తీసుకోవాలని, కండక్టర్ పై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# యాదగిరిగుట్టలో వైభవంగా హనుమాన్ జయంతి మహోత్సవాలు



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం ఆంజనేయస్వామి జయంతి మహోత్సవాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట ఆలయానికి క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి కావడంతో ఉత్సవాలను అంగరంగ వైభవంగా చేపట్టారు. కొండపైన విష్ణుపుష్కరిణి పక్కన ఉన్న హనుమాన్ టెంపుల్ లో, ప్రధానాలయంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో, అదేవిధంగా పాతగుట్ట నారసింహుడి క్షేత్రంలో జయంతి ఉత్సవాలను నయనానందకరంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అష్టోత్తర శతమన్యసూక్త పారాయణాలచే అభిషేకం, లక్ష తమలపాకులతో సహస్ర నామార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.516 టికెట్ కొనుగోలు చేసి భక్తులు హనుమంతుడికి లక్ష తమలపాకులతో సహస్ర నామార్చన పూజలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపుసేవతో ముగిశాయి. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా గురువారం ఆలయానికి రూ.26,82,813 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఆఫీసర్లు వెల్లడించారు.



## యాదగిరిగుట్టలో ఘనంగా 'హనుమాన్ శోభాయాత్ర'

**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** హనుమజ్జయంతి సందర్భంగా యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్ర వైభవంగా జరిగింది. వైకుంఠ ద్వారం వద్ద ఉన్న హనుమాన్ టెంపుల్ లో ప్రత్యేక పూజలు చేసిన హనుమాన్ భక్తులు, అనంతరం హనుమాన్ శోభాయాత్రను ప్రారంభించారు. నరసింహుడి వైకుంఠ ద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టి శోభాయాత్ర షురూ చేశారు. హనుమాన్, శ్రీరాముడు, శివాజీ విగ్రహాలతో గుండ్లపల్లి నుంచి యాదగిరిగుట్ట మీదుగా యాదగిరిపల్లి వరకు శోభాయాత్ర కొనసాగింది. దాదాపుగా 3 గంటల పాటు శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. యాదగిరిగుట్టలో నలుమూలలు కలియ తిరిగిన అనంతరం నరసింహుడి పాదాల వద్ద ఉన్న హనుమాన్ టెంపుల్ వద్ద శోభాయాత్రను ముగించారు. హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా.. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో శోభాయాత్ర ప్రశాంతంగా జరిగింది.



# బీఆర్ఎస్ కార్యకర్త ఫ్యామిలీకి రూ.1.05 లక్షలు అందజేత

### బాధిత కుటుంబానికి స్వయంగా అందజేసిన డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సదా ప్రవీణ్ కుమార్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి.. బీఆర్ఎస్ పార్టీ తరఫున బాధిత ఫ్యామిలీకి రూ.1.05 లక్షలు అందజేశారు. గురువారం యాదగిరిగుట్టలోని మృతుడు ప్రవీణ్ ఇంటికి స్వయంగా వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రవీణ్ మృతి కుటుంబానికి, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్న ఆయన.. బాధిత ఫ్యామిలీకి పార్టీపరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, టౌన్ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ కుమార్ ట్రాన్స్‌ఫర్

### నూతన ఏసీపీగా రానున్న శ్రీనివాసనాయుడు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయన ప్లేస్ లో శ్రీనివాసనాయుడు యాదగిరిగుట్ట ఏసీపీగా రానున్నారు. బదిలీలకు సంబంధించి రాచకొండ కమిషనరేట్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ కుమార్ డీజీపీ ఆఫీస్ కు ట్రాన్స్‌ఫర్ కాగా.. హైదరాబాద్ సిటీ(సీటీసీ) ఏసీపీగా ఉన్న శ్రీనివాసనాయుడు యాదగిరిగుట్టకు బదిలీ అయ్యారు. రెండు రోజుల్లో యాదగిరిగుట్ట ఏసీపీగా శ్రీనివాసనాయుడు బాధ్యతలు చేపట్టనున్నారు.

# ఎమ్మెల్యే అయిలయ్యపై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించం

### - యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో కాంగ్రెస్ నాయకులు



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** ప్రజలకు మంచి చేయడం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై బీఆర్ఎస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడితే సహించబోమని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. గురువారం యాదగిరిగుట్టలోని బీర్ల నిలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నిత్యం ప్రజలతో మమేకమై అధిక నిధులతో ఆలేరును అభివృద్ధి చేస్తుంటే.. బీఆర్ఎస్ నాయకులకు మింగుడు పడడం లేదన్నారు. ఎక్కడ తమ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందోనన్న ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే అయిలయ్యపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సొంత ఊర్లను అభివృద్ధి చేసుకోలేని బీఆర్ఎస్ నాయకులు కర్రె వెంకటయ్య, గడ్డమీది రవీందర్ గౌడ్.. ఎమ్మెల్యే అయిలయ్య గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరులో బీఆర్ఎస్ ను ప్రజలు చిత్తుగా ఓడించినా బీఆర్ఎస్ నాయకుల వక్రబుద్ధి మారలేదన్నారు. ఇకపై ఎమ్మెల్యే అయిలయ్యపై అనుచితంగా మాట్లాడితే చూస్తూ ఊర్కోబోమని, నోరు అదుపులో పెట్టుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బిక్షపతి, మండల నాయకుడు హేమేందర్ గౌడ్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ, మాజీ కౌన్సిలర్ మల్లేష్ యాదవ్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలాం, జిల్లా నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రాజేష్, నరేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

**ఎమ్మెల్యే చిత్రపటం దహనానికి బీఆర్ఎస్ విఫలయత్నం**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఉద్దేశించి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అనుచితంగా మాట్లాడారంటూ.. గురువారం యాదగిరిగుట్టలో బీఆర్ఎస్ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చిత్రపటం దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# బాస్ స్కీం పాఠశాలల ఎంపికకు... ధరఖాస్తుల ఆహ్వానం

**సూర్యాపేట, రోమింగ్ న్యూస్:** సూర్యాపేట జిల్లా పరిధిలోని ఎస్సీ విద్యార్థులకు బెస్ట్‌అవెలబుల్ పథకం కింద 2025-26 విద్యా సంవత్సరానికి 1వ తరగతి డేస్కాలర్, 5వ తరగతి రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు అర్హత ఉన్న విద్యాసంస్థలు ఈ నెల 24 తేదీ లోపు ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొంది ఉండి స్వంత భవనం కలిగి, ఆరేళ్ళుగా 7వ తరగతిలో, 10వ తరగతిలో 90 శాతం ఉత్తీర్ణత, అందులో 50 శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయం రూమ్ నెంబర్ ఎఫ్ 3, మొదటి అంతస్తు, జిల్లా కలెక్టర్ కార్యాలయం సూర్యాపేట నందు సంప్రదించాలని సూచించారు.

ఆసక్తి కలిగిన ప్రైవేటు/కార్పోరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ దిగువ పేర్కొన్న షరతులకు లోబడి ఉండవలెను. దరఖాస్తులు సమర్పించవలసిన చివరి తేది.24.05.2025.

1. పాఠశాల ప్రారంభం నుండి ప్రభుత్వ గుర్తింపు పొంది ఉండాలి.
2. గత (5) సంవత్సరముల నుండి 7వ తరగతి యందు మరియు 10వ తరగతి యందు 90% పైన ఉత్తీర్ణులు అయి ఉండాలి, అందులో 50% మొదటి తరగతి యందు ఉత్తీర్ణత కలిగి ఉండాలి.
3. పాఠశాలలో అన్ని వసతులు మరియు మౌళిక సదుపాయాలు కలిగి ఉండాలి.
4. పాఠశాలల యాజమాన్యం వారి యొక్క ఫీజుల వివరములతో సమర్పించాలి.
5. పాఠశాలలో పని చేసే సిబ్బంది ప్రభుత్వ నియమావళి ప్రకారం ఉండాలి.
6. పాఠశాలకి సొంత భవనముతో పాటు ఆట స్థలం కూడా కలిగి ఉండాలి.
7. పాఠశాలలో డే స్కాలర్ మరియు హాస్టల్ (బాలుర/బాలికలకు వేరు వేరుగా) ఉండాలి.

